క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



నారాయణపేట: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని లబిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఆర్.శివారెడ్డి, లబ్ధిదారులు ఉన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి రథోత్సవం



కృష్ణా: మండలంలోని కున్సి వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని సోమవారం తెల్లవారుజామున వేదపండితుల సమక్షంలో, వేదమంత్రోచ్ఛరణలతో ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అలంకరణ, పల్లకీసేవ నిర్వహించారు. రథోత్సవంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు వేలాది మంది భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట: రాజీవ్ యువ వికాసం పథకం కింద మోడల్ సీఎస్సీ కేంద్రాలు స్థాపించేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీఎస్‌సి జిల్లా మేనేజర్ దిలీప్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీటీపీ/కంప్యూటర్/జిరాక్స్ సెంటర్ ఎంచుకొని, రూ.3లక్షల నుంచి రూ.4 లక్షల యూనిట్‌కిగాను 70–80 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, యువత, మహిళలు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 15 రోజుల శిక్షణ, అనంతరం అర్హులైనవారికి సర్టిఫికెట్, వెల్లడించిన రుణంతో సీఎస్‌సీ కేంద్ర స్థాపనకు ఆమోదం ఇవ్వనున్నట్లు, వివరాలకు సెల్ నం.7217735157 కు సంప్రదించాలని కోరారు.

- నారాయణపేట రూరల్: మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు ఇటీవల ఆన్‌లైన్ లో నమోదు చేసుకున్న రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అందించాలని ఎంపీడీఓ సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతో పాటు అభ్యర్థి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, పట్టాదారు పాస్ పుస్తకం, సదరం సర్టిఫికెట్, పాస్ ఫొటోలను రెండు సెట్లుగా అందించాలని కోరారు.

బీజేపీ జెండావిష్కరణ



నారాయణపేట రూరల్: మండలంలోని సింగారంలో సోమవారం బీజేపీ జెండావిష్కరణ కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా మాజీ సర్పంచ్ నాగిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, క్రిస్టఫర్, సిద్ధప్ప, ఊషప్ప, చంద్రకాంత్, కృష్ణయ్య, చిన్నయ్య, నర్సింహులు, సతీష్, బాలప్ప, బసప్ప, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

పల్లెర్ల హరికథ కాలక్షేపం



మద్దూరు: శ్రీరామనవమిని పురస్కరించుకొని పల్లెర్ల గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఆదివారం రాత్రి తిరుమల తిరుపతి దేవస్థానం అస్థాన భాగవతారిణి జయంతి సావిత్రి 'శ్రీ సీతారామ కల్యాణం' హరికథ కాలక్షేపం చేశారు. ఉదయం ఆలయం ఆవరణలో గ్రామస్తులు సీతారామకల్యాణం నిర్వహించారు. సీతారామ కల్యాణంలో వివిధ ఘట్టాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కళాకారులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్ గేటు సమీపంలో గ్రామ యువజన సంఘం అధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజినీర్ సురేందర్‌రెడ్డి, సీనియర్‌నాయకులు వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. రాఘవేందర్‌రెడ్డిని అభినందించారు.

యథేచ్ఛగా మట్టి దందా!

- మట్టి తరలించేందుకు గుట్టలపైకి ప్రత్యేక రోడ్డు
- రాత్రి అయితే చాలు టిప్పర్లతో ఎర్రమట్టి తరలింపు
- మామూళ్ల మత్తులో పట్టించుకోని అధికారులు
- కబ్జా అవుతున్న ప్రభుత్వ భూమి



మట్టిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న జేసీబీ



గుట్టపైకి ఏర్పాటు చేసిన రోడ్డు



ధన్వాడలో రాత్రి పూట పోలీసుల ముందే తరలుతున్న మట్టి టిప్పర్(ఫైల్)

ధన్వాడ: మట్టి వ్యాపారులకు రోజూ మూడు పువ్వులు, ఆరు కాయలుగా వ్యాపారం కొనసాగుతోంది. ఎర్ర మట్టి గుట్టలు కనిపిస్తే చాలు, వాటిని తవ్వి మట్టిని తరలిస్తూ రోజుకు లక్షల్లో సంపాదిస్తున్నారు. మట్టి అక్రమంగా రవాణా అవుతోందని అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదు. గుట్టలు చదును అయిన వెంటనే పక్కనే ఉన్న పొలం యజమాని దాన్ని కబ్జా చేస్తున్నాడు. దీన్ని చూస్తున్న చుట్ట పక్కల రైతులు తమ భూమి పక్కన ఉన్న గుట్టల్లో సైతం మట్టిని తరలించుకోండి అని వారి వెంట పడుతున్నారు. ధన్వాడ మండలంలోని మన్నిపూర్‌తండా, యంనోనిపల్లి గ్రామ శివారులో ఎర్రమట్టి దందా కొనసాగుతోంది. ఇక్కడున్న ప్రభుత్వ స్థలానికి సంబంధించి రెవెన్యూ, ఫారెస్ట్ గుట్టలను అనుమతి లేకుండా కొందరు రాత్రి సమయంలో జేసీబీలతో మట్టిని తవ్వేస్తున్నారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్ పోలీసుల కళ్ల ముందే మట్టిని తరలిస్తున్నా, వారు అటువైపు చూడడం లేదు. ఉదయం సమయంలో 3 నుంచి 4 ట్రిప్పులకు అనుమతి తీసుకొని రాత్రి వరకు మట్టిని తరలిస్తునే ఉన్నారు. ప్రభుత్వానికి టిప్పరు ట్రిప్పుకు రూ.700 చొప్పున చెల్లిస్తున్నారు. అదే ట్రిప్పు మట్టిని రూ.3వేలకు ఇతర గ్రామాలకు రూ.4 నుంచి రూ.6వేలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా అక్రమంగా మట్టిని తరలిస్తూ రోజూ లక్షల్లో సంపాదిస్తున్నారు. మట్టి కోసం చెట్లను సైతం నరికేస్తున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

అనుమతి ఇవ్వడం లేదు..



గుట్ట తవ్వకాలకు ఎలాంటి అనుమతి ఇవ్వడం లేదు. అక్రమంగా గుట్టలపై తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. భూములు కబ్జా చేసుకునేందుకు ఎలాంటి హక్కు లేదు. సొంత పొలంలో మట్టిని తరలించాలన్నా మైనింగ్, గనులశాఖ అధికారుల అనుమతి తీసుకోవాలి.

– సింధుజా, తహసీల్దార్, ధన్వాడ

సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి



లింగంపల్లిలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

సాక్షి, నెట్‌వర్క్: పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మక్తల్ మండలంలోని లింగంపల్లిలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికి రూ.5లక్షలు అందించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. మక్తల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, తహసీల్దార్ సతీష్ కుమార్, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ గేటు మీది హన్మంతు పాల్గొన్నారు.

- ఊట్కూరు మండలంలో పగిడిమారిలో సన్నబియ్యం పంపిణీ ఎమ్మెల్యే ప్రారంభించారు. అమీన్‌పూర్‌లో క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చింతరవి, నాయకులు బసవరాజుగౌడ్, నారాయణరెడ్డి ఉన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ

- ఊట్కూరు మండలంలోని తిప్రాస్‌పల్లిలో సోమవారం నాభిశిల బొడ్రాయి ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

కన్మనూర్‌కు 50 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

- మరికల్ మండలంలోని కన్మనూర్‌లో అర్హులైన పేదలు ఇళ్లు నిర్మించుకోవడం కోసం 50 ఇందిరమ్మ ఇళ్లు మొదటి విడతలో మంజూరు చేస్తామని ఎమ్మెల్యే శ్రీహరి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కన్మనూర్, జిన్నారం, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డి, డీలర్లు నిర్మల, మహేశ్వర్‌రెడ్డి, నాగరాజ్, చెన్నయ్య పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

- మక్తల్ పట్టణంలో కొత్తసూగయ్య, రత్నమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీ పడమటి ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర అంబలి కేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రీహరి ప్రారంభించారు. ప్రతి సంవత్సరం అంబలి కేంద్రం ఏర్పాటు చేయడంపై వారి కుమారులు కొత్త జగదీష్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, సూర్యనారాయణ, కొత్త నర్సింహులు, డాక్టర్ కిరణ్ తదితరులను ప్రత్యేకంగా అభినందించారు.

ఆలయ నిర్మాణానికి రూ.5లక్షల విరాళం

- మక్తల్ పట్టణంలో శ్రీవేణుగోపాల స్వామి ఆలయం పునఃనిర్మాణానికి మాజీ సర్పంచు సూర్యనారాయణ రూ.5లక్షలు విరాళంగా చెక్కును ఎమ్మెల్యే ద్వారా ఆలయ అభివృద్ధికి, విగ్రహాల కోసం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆయనను ఎమ్మెల్యే అభినందించారు.

కూలి గిట్టుబాటయ్యేలా చూడాలి



ఉపాధి హామీ పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ కృష్ణారావు

కొత్తపల్లి: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు రోజు వారిగా రూ.307 కూలి అందాలని ఎంపీడీఓ కృష్ణారావు అన్నారు. సోమవారం మండలంలోని ఎక్కామేడ్ గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను పర్యవేక్షించి టీఏలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఉపాధి కూలీలు వడదెబ్బకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీపంలో ఉన్న నర్సరీలను పరిశీలించారు. నర్సరీలో మొక్కలు మొలకెత్తని చోట కొత్త విత్తనాలు నాటి 100 శాతం మొక్కల పెరుగుదల సాధించేలా చూడాలన్నారు. వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు ఎంచుకున్న లక్ష్యం మేరకు మొక్కలు పెంచేలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మద్దూరు: పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ నర్సింహారెడ్డి ఉపాధ్యాయులకు, వంట ఏజెన్సీ మహిళలకు తెలిపారు. సోమవారం మండలంలోని పెదిరిపాడ్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

అంబేడ్కర్ జాతర కమిటీ ఎన్నిక



కొత్తపల్లి: అంబేడ్కర్ 3వ జాతర మండల కమిటీని సోమవారం కొత్తపల్లి మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు యు మహేష్ ఆదేశాల మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నరేష్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, దుప్పటి గట్టు, ప్రచార కార్యదర్శిగా డేవిడ్, కోశాధికారిగా నందిగామ అంజిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమ్మ, గౌరవ అధ్యక్షులు చిన్నయ్య, మద్దూరు మండల జాతర కమిటీ అధ్యక్షులు దుబాయి కృష్ణ, రాము నాయక్, వెంకటయ్య, కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు ఇవ్వాలని ధర్నా



నారాయణపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్/దామరగిద్ద: అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించాలని పీఓడబ్ల్యూ, పీవైఎల్ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ ప్రజల మౌలిక సమస్యలను గుర్తించి ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో పదేళ్ల పాటు రేషన్ కార్డుల ఊసే లేకపోవడంతో ఎంతో మంది కొత్తగా పేర్లు చేర్చుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని సరి చేస్తూ అర్హులైన వారికి రేషన్‌కార్డులు ఇచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సునిత, లక్ష్మి, గజాలమ్మ, అరుణ, మధు, రాయప్ప, రాము, మహేష్, భాస్కర్, రాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

- అర్హులైన పేదలందరికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రగతి శీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. పీవైఎల్ జిల్లా కార్యదర్శి కోస్గి ప్రతాప్ ఆధ్వర్యంలో దామరగిద్ద తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ జమిల్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు సునిత, లక్ష్మి, గజలమ్మ, అరుణ, ప్రతాప్, సాయి, మధు, తాయప్ప, రాము, భాస్కర్, రాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



మరికల్: మండలంలోని జిన్నారంలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ, సీసీ రోడ్డు పనులకు సోమవారం తహసీల్దార్ అనిల్‌కుమార్ భూమిపూజ చేశారు. గ్రామంలో ఎమ్మెల్యే నిధులు రూ.4లక్షలతో 100 మీటర్ల సీసీరోడ్డు పనులు చేయనున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రహరీ పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ పనులు నాణ్యతగా చేపట్టాలని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సూర్యమోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చెన్నయ్య, శ్రీనివాస్‌రెడ్డి, హరీష్ పాల్గొన్నారు.

ఎంఐఎస్, సీఆర్‌పీలను సన్మానించిన ఎంఈఓ



ఎంఐఎస్,సీఆర్‌పీలను సన్మానిస్తున్న మండల ఉపాధ్యాయులు

కృష్ణా: మండలంలో గత కొంత కాలంగా సీఆర్‌పీగా రమేష్, ఎంఐఎస్‌గా నరేష్‌గౌడ్‌లు బాధ్యతలు నిర్వహిస్తూ, ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందడంతో వారిని ఎంఈఓ నిజాముద్దీన్, మండల ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా వీరు ఈ మండలంలోని విద్యాశాఖలో పని చేయడంతో పాటు వివాదరహితులుగా పేరొందడం అభినందనీయమన్నారు. ఇక మీదట ఉపాధ్యాయులుగా ఒకరు పుంజనూర్‌కు, మరొకరు ముదుమాల్ పాఠశాలకు నియామకం అయిన సందర్భంగా వారిని సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ధన్వాడ: మండలంలోని పాతపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గాయత్రి, కంప్లెక్స్ హెచ్‌ఎం నరసింహచారి, ఉపాధ్యాయులు రామకృష్ణ, స్వాతి కుమారి, ఫిరోజ్ పాల్గొన్నారు

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

దామరగిద్ద: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజు వివరాల ప్రకారం.. మండలంలోని కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన వడ్డే మల్లేష్(41) తన ఇంటి సమీపంలో ఉన్న నెమలి చెట్టుకు ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని, ఆమెను అదుపులో పెట్టుకోలేక కుల పరువును తీస్తున్నారని, ఆమెను మార్చుకోవాలని లేదా చావాలని అతని పినతండ్రి మందలించాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన మల్లేష్ ఇంటి సమీపంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని గమనించి గ్రామస్తులు వెంటనే మల్లేష్ తమ్ముడు వడ్డె వెంకటప్పకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న తమ్ముడు నారాయణపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. వెంకటప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

లబ్ధిదారుడి ఇంట్లో సన్నబియ్యం భోజనం



పూసల్‌పహాడ్‌లో లబ్ధిదారుడి ఇంట్లో సన్నబియ్యంతో భోజనం చేస్తున్న అధికారులు



గోకుల్‌నగర్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

మరికల్: మండలంలోని పూసల్‌పహాడ్ గ్రామంలో లబ్ధిదారుడి ఇంట్లో అధికారులు ప్రభుత్వం అందజేసిన సన్నబియ్యం భోజనం చేశారు. మండలంలో సోమవారం రాకొండ, పూసల్‌పహాడ్, పల్లెగడ్డలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం తహసీల్దార్ అనిల్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం పూసల్‌పహాడ్‌లో రాములు చారి ఇంట్లో సన్నబియ్యంతో చేసిన భోజనం అధికారులతో పాటు కాంగ్రెస్ నాయకులు కలిసి తిన్నారు. లబ్ధిదారులు సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డి, సూర్యమోహన్ రెడ్డి, వీరన్న, హరీష్, ఆంజనేయులు, మల్లారెడ్డి, జయసింహారెడ్డి, నరహరి, రాయుడు, హర్షవర్ధన్ రెడ్డి, రాజు, రామకృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.

పేదలకు వరం సన్నబియ్యం

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం కార్యక్రమాన్ని మండలంలోని గోకుల్‌నగర్‌లో మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనార్దన్, నారాయణ, శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెన్నారెడ్డిపల్లిలో..

మద్దూరు: మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, హన్మిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి

నారాయణపేట: దేశంలో ఉద్యోగ కార్మికులను కట్టు బానిసత్వంలోకి నెట్టే నాలుగు కార్మిక కోడ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి జయలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం నారాయణపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అభినందన్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సీఐటీయూ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న కనీస వేతనాల చట్టం, ఉద్యోగ భద్రత చట్టం, 8 గంటల పని విధానం, సంఘం పెట్టుకునే హక్కు, సంఘటితంగా పోరాడే హక్కు, సమ్మె హక్కు తదితర హక్కులతో కూడుకున్న అనేక చట్టాలన్నీ లేబర్ కోడ్‌లతో ఆవిరి అయిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బడా పెట్టుబడుదారులకు, యజమానులకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్లు వెనక్కి తీసుకునే దాకా కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 11 జాతీయ కార్మిక సంఘాలు మే 20న జాతీయ సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని, ప్రైవేటీకరణ విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర నేత భూపాల్, జిల్లా కార్యదర్శి బల్ రామ్, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు జోషి, గోవిందరాజు కాశీనాథ్, భీమప్ప, డి కృష్ణయ్య, భీమేష్, శ్రీనివాసులు, శశికళ, పుష్ప, బాలమణి, జయంతి, తిరుపతమ్మ, బాలప్ప, సాయిలు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారుడికి సన్మానం



కబడ్డీ క్రీడాకారుడిని సన్మానిస్తున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి తిరుపతిరెడ్డి

మరికల్: మండల కేంద్రానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు వేణు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలో ప్రతిభ చూపడంతో సోమవారం ఘనంగా సన్మానించారు. మరికల్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ గోవర్ధన్, యువక మండలి అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డిలు కబడ్డీ క్రీడాకారుడు వేణును అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో సురేష్, మహేందర్, రాజశేఖర్, ప్రకాశ్, సత్యారెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



ఊట్కూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పాల్గొన్న వైద్యసిబ్బంది

ఊట్కూరు: మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రి లో సోమవారం జిల్లా న్యాయ అధికారి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోషి, అడ్వకేట్ లక్ష్మీపతిగౌడ్, నాగేశ్వరి, విజయకుమార్ పాల్గొన్నారు.